క్లుప్తంగా

నేడు హోమియో ఉచిత వైద్యశిబిరం

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ డివిజన్ బుద్వేల్‌లోని అరుంధతి వెల్ఫేర్ అసోసియేషన్‌లో బుధవారం ఉచిత హోమియోపతి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్షులు కోరని బాలరాజ్ తెలిపారు. శంషాబాద్ ముచ్చింతల్‌లోని జిమ్స్ హోమియోపతిక్ మెడికల్ కళాశాల, ఆసుపత్రి ఆధ్వర్యంలో అసోసియేషన్ కమ్యూనిటీహాల్‌లో ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఉంటుందని జలుబు, దగ్గు, జ్వరం, కీళ్ల నొప్పులు, మధుమేహం, ఉబ్బసం, గొంతు, ఎముకలు, కిడ్నీ, స్త్రీ సంబంధిత సమస్యలకు వైద్య పరీక్షలు చేసి మందులను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. బుద్వేల్‌తో పాటు చుట్టు పక్కల ప్రాంతాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జన్మదిన శుభాకాంక్షలు



బాబురావు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న వై.శ్రీధర్ తదితరులు

రాజేంద్రనగర్: బీజేపీ రాజేంద్రనగర్ డివిజన్ అధ్యక్షుడు బాబురావు జన్మదిన వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యులు వై.శ్రీధర్ ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపి భారీ కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపారు.

కమిషనర్ పర్యటన



అవెన్యూ ప్లాంటేషన్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ బి.శరత్‌చంద్ర

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ 12వ డివిజన్‌లో కమిషనర్ బి.శరత్‌చంద్ర మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా అధికారులతో కలిసి అవెన్యూ ప్లాంటేషన్, నర్సరీలను పరిశీలించారు. పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. హరితహారం కార్యక్రమానికి నర్సరీలలో మొక్కలను సిద్ధం చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీఈ యాదయ్య తదితరులున్నారు.

వర్షాకాలం అప్రమత్తంగా ఉండాలి

రాజేంద్రనగర్: భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉండడంతో తగు జాగ్రత్తలు తీసుకోవాలని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్, జీహెచ్‌ఎంసీ కౌన్సిల్ విప్ తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం కాటేదాన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వర్షాల నేపథ్యంలో పిల్లలను ఇళ్ల నుంచి బయటకి వెళ్లనివ్వకుండా చూసుకోవాలన్నారు. కరెంట్ స్తంభాల వద్దకు వెళ్లొద్దని సూచించారు. ఇంటితో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు వచ్చినా తమ దృష్టికి తీసుకురావాలని, డివిజన్ పార్టీ కార్యాలయంలో సంప్రదిస్తే వారికి సేవలు అందించేందుకు సిద్ధంగా ఉంటామని తెలిపారు.

ఉమ్రాకు యాత్రికులు



శంషాబాద్: పవిత్ర ఉమ్రా యాత్రకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్నాటక రాష్ట్రాలకు చెందిన వంద మంది యాత్రికులు మంగళవారం ఉదయం శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి బయలుదేరారు. యాత్రికులకు వారి కుటుంబసభ్యులు, బంధువులు, స్నేహితులు శుభాకాంక్షలు తెలిపారు. యాత్రికులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా అల్‌మిజాన్ సంస్థ పర్యవేక్షించనున్నట్లు సంస్థ ఎండీ ఫయాజ్ అలీ తెలిపారు.

దేవాలయంలో చోరీ

అత్తాపూర్: దేవాలయంలో హుండీ బద్దలు కొట్టి నగదు ఎత్తుకెళ్లిన సంఘటన అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అత్తాపూర్ నల్లపోచమ్మ ఆలయంలో స్థానికుడు మేకల రాంరెడ్డి ఆలయం గేట్లకు తాళం వేసి ఇంటికి వెళ్లాడు. అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తి దేవాలయంలోకి చొరబడి హుండీని బద్దలు కొట్టి అందులో ఉన్న నగదును ఎత్తుకెళ్లాడు. తెల్లవారుజామున దేవాలయానికి వచ్చిన స్థానికులు చూసి అత్తాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడు దేవాలయానికి వచ్చి హుండీ బద్దలు కొట్టిన దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డు అయ్యాయి. నిందితుడి కోసం గాలిస్తున్నారు.

సెల్లార్ తవ్వకం.. వారికి శాపం

- రెండు అపార్ట్‌మెంట్ల ప్రహరీలకు ప్రమాదం
- రాత్రికి రాత్రే ఖాళీ చేయించిన అధికారులు
- ప్రత్యామ్నాయ ప్రాంతాలకు 35 కుటుంబాలు
- నల్లగండ్లలో దయనీయ పరిస్థితి



కూలిపోయిన అపార్టుమెంట్ ప్రహరీ

శేరిలింగంపల్లి: ఇటీవల కురుస్తున్న వర్షాలతో సెల్లార్ కోసం తవ్విన గుంత పక్కనే ఉన్న ప్రహరీ కూలిపోవడంతో ఆ అపార్ట్‌మెంట్ వాసుల పరిస్థితి దయనీయంగా మారింది. జీహెచ్‌ఎంసీ అధికారులు, పోలీసులు వెంటనే అప్రమత్తమయ్యారు. రెండు అపార్ట్‌మెంట్లలోని వారిని సోమవారం రాత్రికి రాత్రే ఖాళీ చేయించారు. కట్టుబట్టలు, ఇతర విలువైన సామాన్లతో బయటికి వెళ్లిపోయిన ఘటన గచ్చిబౌలి డివిజన్ నల్లగండ్లలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం వివరాలు..

సెల్లార్ తవ్వకాల్లో వర్టెక్స్ నిర్మాణ సంస్థ

ఏడాదిన్నర క్రితం నుంచి బహుళ అంతస్తుల భవన నిర్మాణం కోసం వర్టెక్స్ నిర్మాణ సంస్థ సెల్లార్ తవ్వకాలు జరుపుతోంది. ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలకు ఈ సెల్లార్ తవ్వకానికి ఆనుకొని ఉండే శ్రావ్య అపార్ట్‌మెంట్, ఆపిల్ అపార్ట్‌మెంట్ల ప్రహరీలు కూలిపోయాయి. ఒక దానికి బీటలు రాగా, మరొకటి సగానికిపైగా కూలిపోయింది. ఘటనా స్థలానికి జీహెచ్‌ఎంసీ వెస్ట్‌జోన్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, డిప్యూటీ కమిషనర్ రజనీకాంత్‌రెడ్డి, ఈఈ శ్రీనివాస్, టౌన్ ప్లానింగ్ అధికారులు, పోలీసులు వచ్చారు. అపార్టుమెంట్‌వాసులతో మాట్లాడారు. సోమవారం రాత్రి 11.30 గంటల ప్రాంతంలో రెండు అపార్ట్‌మెంట్లలో 35 కుటుంబాలను ఖాళీ చేయించారు. వర్టెక్స్ నిర్మాణ సంస్థ ప్రతినిధులతో అధికారులు మాట్లాడి వారికి రాత్రి వేళ ఉండేందుకు వసతి ఏర్పాటు చేశారు. ఎవరో చేసిన తప్పిదానికి తాము ఫలితం అనుభవించాల్సి రావడం అన్యాయమని అపార్టుమెంట్ వాసులు ఆవేదన వ్యక్తంచేశారు. వర్టెక్స్ నిర్మాణ సంస్థ ప్రతినిధులు శ్రావ్యాస్ అపార్టుమెంట్ కింది భాగంలో సపోర్ట్ కోసం రాడ్స్‌ను ఏర్పాటు చేశారు. ఆయా అపార్టుమెంట్‌ల నుంచి వచ్చే డ్రైనేజీ మళ్లించేందుకు చర్యలు చేపట్టారు. సెల్లార్ గోడ కూలకుండ ప్లాస్టిక్ షీట్లతో కప్పారు.



సెల్లార్ తవ్వకాలు

నోటీసులు ఇచ్చాం..

సెల్లార్ తవ్వకంతో అపార్టుమెంట్ల ప్రహరీలు దెబ్బతినడంతో నిర్మాణ సంస్థ వర్టెక్స్‌కు నోటీసులు ఇచ్చినట్లు డిప్యూటీ కమిషనర్ రజనీకాంత్‌రెడ్డి తెలిపారు. జేఎన్‌టీయూ టెక్నికల్ బృందం పరిశీలించనుందని ఆయన చెప్పారు. బృందం ఇచ్చే నివేదిక ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.

భయాందోళనకు గురయ్యాం...



సెల్లార్ పక్కనే ఉన్న ప్రహరీ కూలడంతో భయాందోళనకు గురయ్యాం. అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రాణ నష్టం జరగలేదు. రాత్రికి రాత్రే వెళ్లాలంటే ఎంతో అసౌకర్యానికి గురయ్యాం. వర్టెక్స్ నిర్మాణ సంస్థపై పోలీసులకు, జీహెచ్‌ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేస్తాం.

– భార్గవి, యాపిల్ అపార్టుమెంట్

నిర్లక్ష్యంతోనే సమస్య...



నిర్మాణ సంస్థ నిర్లక్ష్యంతోనే ఈ సమస్య వచ్చింది. ఎప్పటి నుంచే నిర్మాణ సంస్థకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకుండా రోడ్డు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వేశామని చెబుతున్నారు. సదరు నిర్మాణ సంస్థపై చర్యలు తీసుకొని సమస్యను పరిష్కరించాలి.

– జానకీ శ్రీధర్‌రెడ్డి, యాపిల్ అపార్టుమెంట్

మోడీ దిష్టిబొమ్మ దహనం: సీపీఎం నిరసన



కాటేదాన్ చౌరస్తాలో నిరసనలో పాల్గొన్న సిపిఎం నాయకులు



బుద్వేల్ చౌరస్తాలో మోడీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

రాజేంద్రనగర్: ప్రజలకు రక్షణ కల్పించడంలో మణిపూర్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సీపీఎం మండల కార్యదర్శి కురుమయ్య అన్నారు. సిపిఎం రాజేంద్రనగర్ మండల కమిటీ ఆధ్వర్యంలో మణిపూర్ రాష్ట్రంలో శాంతి నెలకొల్పాలని ఘటనకు కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని కోరుతూ కాటేదాన్ చౌరస్తాలో మంగళవారం నిరసన తెలిపారు. మండల కార్యదర్శి కురుమయ్య మాట్లాడుతూ ప్రజల మానప్రాణాలు కాపాడడంలో మణిపూర్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, వెంటనే గద్దె దిగిపోవాలని అన్నారు. ఇప్పటికైనా బీజేపీ పాలకులు శాంతి నెలకొల్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు ఎస్.మోహన్, ఎస్.జంగయ్య, నాయకులు ఎం.బాలస్వామి, మొగులయ్య, శంకరయ్య, మహమ్మద్, ఆలీ, కొండయ్య, రాములు తదితరులు పాల్గొన్నారు.

బుద్వేల్ చౌరస్తాలో..

అలాగే రాజేంద్రనగర్ మండలం బుద్వేల్ చౌరస్తాలో ప్రధానమంత్రి నరేంద్రమోడీ దిష్టిబొమ్మను దహనం చేశారు. మణిపూర్‌లో శాంతిని నెలకొల్పాలని కోరారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పార్టీ మండల సీనియర్ నాయకులు, రంగారెడ్డి జిల్లా మాజీ కార్యదర్శి పుస్తకాల నర్సింగ్‌రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘటనలకు కారకులైన వారిని వెంటనే శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల పార్టీ సహకార్యదర్శి విజయానంద్, మండల నాయకులు ఆనంద్‌గౌడ్, బండి నర్సింహ్మ, జిల్లా పార్టీ కార్యాలయ కార్యదర్శి జి.సత్యం, శాంతమ్మ, గ్రామ శాఖ కార్యదర్శి కామ్రేడ్ మొగులయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు నిరసన ర్యాలీ

అత్తాపూర్: మణిపూర్ ఘటనలను ఖండిస్తు బుధవారం నిరసన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు రాజేంద్రనగర్ నియోజకవర్గ క్రైస్తవ సంఘాలు, వివిధ రాజకీయ పార్టీల సభ్యులు వెల్లడించారు. బుధవారం ఉదయం 10 గంటలకు బుద్వేల్ బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద ఈ నిరసన కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, క్రైస్తవ సంఘాల సభ్యులు, ప్రజలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

గొర్రెలు మృత్యువాత



మృతిచెందిన గొర్రెలను పరిశీలిస్తున్న డాక్టర్ సయ్యద్ మునీరుద్దీన్

మణికొండ: గత రెండు రోజులుగా భారీ వర్షాలు కురవటంతో మంగళవారం ఏకంగా 30 గొర్రెలు మృత్యువాత పడ్డాయి. నార్సింగి మున్సిపాలిటీ కేంద్రంలో యాదయ్యయాదవ్ కుటుంబం గొర్రెలను పెంచుతూ జీవనం సాగిస్తున్నారు. గొర్రెలు మృతి చెందడంతో పశువుల డాక్టర్‌ను పిలిచి చూపగా వాటి నమూనాలను పంపి వ్యాధిని గుర్తిస్తామని తెలిపారన్నారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని యాదయ్యయాదవ్ కోరారు.

సన్మానం



ఏసీపీ లక్ష్మీనారాయణను సన్మానించిన నాయకులు

మణికొండ: నార్సింగి డివిజన్ ఏసీపీగా నియమితులయిన లక్ష్మీనారాయణను నార్సింగి మున్సిపాలిటీ నాయకులు మంగళవారం సన్మానించారు. శాంతి భద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరు తమ వంతు సహకారం అందించాలని ఏసీపీ వారికి సూచించారు. కార్యక్రమంలో నార్సింగి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎం. ప్రవీణ్‌యాదవ్, బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు నర్సింహ, నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గండిపేట సబ్ రిజిస్ట్రార్‌గా అబ్దుల్ హఫీజ్



మణికొండ: గండిపేట సబ్ రిజిస్ట్రార్‌గా అబ్దుల్ హఫీజ్ మంగళవారం బాధ్యతలు తీసుకున్నారు. ఇక్కడ పనిచేసిన సబ్‌రిజిస్ట్రార్ సహదేవ్ ఘట్‌కేసర్‌కు ఆరు నెలల క్రితం బదిలీ అయ్యారు. హాయన స్థానంలో ఎవరినీ నియమించకపోవటంతో ఇక్కడే సీనియర్ అసిస్టెంట్ విజయకుమారిని ఇన్‌చార్జిగా నియమించారు. కాగా గజ్వేల్ నుంచి బదిలీపై మహ్మద్ అబ్దుల్ హఫీజ్ వచ్చారు.

దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు



జలమయమైన రోడ్డును పరిశీలిస్తున్న మేయర్, కమిషనర్ తదితరులు

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో దెబ్బతిన్న రహదారులను కార్పొరేషన్ మేయర్ మహేందర్‌గౌడ్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దర్గాఖలీజ్ ఖాన్ నుంచి కిస్మత్‌పూర్ వరకు, ఎర్రకుంట నుంచి కిస్మత్‌పూర్ ప్రధాన రహదారి వరకు రోడ్డును పరిశీలించామన్నారు. భారీ వర్షాల కారణంగా, వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని, దెబ్బతిన్న రహదారులను త్వరితగతిన మరమ్మత్తులు చేయాలని ఆదేశించారు. ప్రజలకు అత్యవసరం ఉంటే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావద్దు అని విజ్ఞప్తి చేశారు. ఈ పర్యటనలో మున్సిపల్ కమిషనర్ శరత్‌చంద్ర, పార్టీ అధ్యక్షుడు సురేష్‌గౌడ్, ఎస్‌ఈ శివనంద, డీఈ యాదయ్య, కార్పొరేటర్ అస్లాంబిన్ అబ్దుల్లా, యూత్ ప్రెసిడెంట్ మల్లేష్‌యాదవ్, నాయకులు, కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

సెల్లార్ పూడ్చివేతకు ఆదేశాలు



ఏసీపీ మెప్రాతో మాట్లాడుతున్న కాలనీ అధ్యక్షులు సత్యనారాయణరావు, లావెన్ హోమ్స్ వాసులు



నల్లగండ్లలో సెల్లార్ పూడ్చివేస్తున్న దృశ్యం

శేరిలింగంపల్లి: గచ్చిబౌలి డివిజన్ నల్లగండ్లలో అపార్టుమెంట్ సెల్లార్‌తో తమ అపార్టుమెంట్‌కు ప్రమాదం ఉందని లావెన్ హోమ్స్‌వాసులు ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం ఉదయం నల్లగండ్లలోని గౌతమి మోడల్ స్కూల్ సమీపంలో ఓ నిర్మాణ సంస్థ అపార్టుమెంట్ సెల్లార్ తవ్వకం ఏప్రిల్ నుంచి కొనసాగుతుంది. సోమవారం రాత్రి కురిసిన వర్షానికి లావెన్ హోమ్స్ అపార్టుమెంట్ ప్రహరీ కింది భాగంలో మట్టి కూలిపోవడంతో అపార్టుమెంట్‌వాసులు ఆందోళన వ్యక్తం చేశారు. కాలనీ అధ్యక్షులు మంత్రిప్రగడ సత్యనారాయణ రావు జీహెచ్‌ఎంసీ అధికారులు, ప్రభుత్వ విప్ గాంధీకి సమస్యను వివరించారు. వెంటనే టౌన్ ప్లానింగ్ ఏసీపీ మెప్రా సెల్లార్‌ను పూడ్చాలని ఆదేశించారు. లావెన్ హోమ్స్ ప్రతినిధులు రెసిడెన్షియల్ ప్రాంతంలో హాస్పిటల్ నిర్మాణానికి ఎలా అనుమతులు ఇచ్చారని నిలదీశారు. కనీస నిబంధనలు పాటించకుండా ఇష్టానుసారంగా సెల్లార్ తవ్వారని, వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పలు అభివృద్ధి పనులు ప్రారంభం



కోకాపేటలో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

మణికొండ: మున్సిపాలిటీల పరిధిలోని అన్ని వార్డులలో ప్రజలకు కనీస సౌకర్యాలు కల్పిస్తున్నామని ఎమ్మెల్యే టి. ప్రకాశ్‌గౌడ్ అన్నారు. మంగళవారం ఆయన నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని 14,3,5వ వార్డులలో రూ.6.95 కోట్లతో చేపట్టిన కమ్యూనిటీహాల్, మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్, సీసీ రోడ్లు, బీటీ రోడ్లు, అంతర్గత డ్రైనేజీ పనులను మున్సిపల్ చైర్‌పర్సన్ డి.రేఖయాదగిరి, వైస్ చెర్మన్ జి.వెంకటేశ్‌యాదవ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల అవసరాలను ఎప్పటికప్పుడు తెలుసుకుని వాటిని తీర్చేందుకు నిధులను కేటాయించి వారికి అవసరమైన అన్ని రకాల అభివృద్ధి పనులను చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బి.సురేందర్‌రెడ్డి, కౌన్సిలర్‌లు జి.శివారెడ్డి, ఆర్.ఆదిత్యరెడ్డి, పత్తి ప్రవీణ్‌కుమార్, కోఆప్షన్ సభ్యుడు వి.ప్రశాంత్ యాదవ్, మాజీ ఎంపీపీ తలారి మల్లేష్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పి.చంద్రశేఖర్‌రెడ్డి, నాయకులు గోపాలగణేష్, మల్లేష్, గణేష్‌రెడ్డి, విశ్వనాథ్‌లు పాల్గొన్నారు.

కర్ణాటక ఫలితాలే వస్తాయి

టీపీసీసీ ప్రధాన కార్యదర్శి జ్ఞానేశ్వర్



మాట్లాడుతున్న జ్ఞానేశ్వర్

మణికొండ: డిసెంబర్‌లో జరగనున్న ఎన్నికల్లో కర్ణాటక ఫలితాలే తెలంగాణ రాష్ట్రంలోనూ వస్తాయని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బి.జ్ఞానేశ్వర్‌ముదిరాజ్ అన్నారు. మంగళవారం కాంగ్రెస్ పార్టీ నార్సింగి మున్సిపాలిటీ అధ్యక్షుడు కె. అశోక్‌యాదవ్ అధ్యక్షతన నిర్వహించిన పార్టీ ముఖ్యనాయకుల సమావేశంలో ఆయన రాష్ట్ర మైనార్టీ ఇంచార్జి ఫహీమ్ ఖురేషతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం మాటలు కోటలు దాటుతున్నా పనులు గడప దాటడం లేదన్నారు. కేవలం ఎన్నికలలో గెలుపు కోసమే ప్రజలను మభ్యపెట్టే పథకాలను ప్రవేశపెట్టారన్నారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎన్నుకునేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. మరో వారం రోజుల్లో హాత్ సే హాత్ జోడో కార్యక్రమం నార్సింగి మున్సిపాలిటీలో నిర్వహిస్తామని, విజయవంతం చేసేందుకు ప్రతి నాయకుడు, కార్యకర్త కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు ముంగి జైపాల్‌రెడ్డి, ఎస్సీసెల్ రాష్ట్ర నాయకుడు డి.కిరణ్‌కుమార్, కౌన్సిలర్‌లు, మాజీ సర్పంచ్‌లు, మాజీ వార్డు సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

సీతారామస్వామికి ప్రత్యేక పూజలు



మండలాభిషేకం పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ తదితరులు

మణికొండ: మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని అలకాపూర్ టౌన్‌షిప్‌లో శ్రీరామచంద్రస్వామి ఆలయంలో మంగళవారం నిర్వహించిన మండలాభిషేకం పూజలో ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ పాల్గొన్నారు. ఎమ్మెల్యేతో పాటు మాజీ ఎంపీపీ తలారి మల్లేష్, మున్సిపాలిటీ బీఆర్‌ఎస్ పార్టీ ఫ్లోర్ లీడర్ కె.రామకృష్ణారెడ్డి, పార్టీ అధ్యక్షుడు బి.శ్రీరాములు, కౌన్సిలర్ వసంతరావు, నాయకులు జయరాజ్, ప్రమోద్‌రెడ్డి, నీలేష్‌ప్రసాద్, బాల్‌రెడ్డి, శ్రావణ్‌కుమార్, లక్ష్మీశ్రీ తదితరులు పాల్గొన్నారు.

గోల్కొండకు భక్తుల తాకిడి

గోల్కొండ: గోల్కొండ కోటలో భక్తుల తాకిడి తగ్గడం లేదు. జగదాంబిక మహంకాళి అమ్మవారి ఆషాఢ బోనాలకు రాలేని వారు 3 రోజులుగా వర్షాన్ని సైతం లెక్కచేయకుండా దర్శనానికి వస్తున్నారు. కోట నగీనాబాగ్‌లోని నాగదేవతకు పూజలు నిర్వహించి కోటపై మహంకాళి అమ్మవారిని దర్శించుకుంటున్నారు.



అమ్మవారి పూజలో పాల్గొన్న భక్తులు

పైప్‌లైన్ పనుల పరిశీలన



టోలిచౌకి వద్ద పైప్‌లైన్ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: కొత్తగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. మంగళవారం ఆయన నానల్‌నగర్, టోలిచౌకి, గోల్కొండ, లంగర్‌హౌస్ తదితర డివిజన్లలో పర్యటించారు. కార్వాన్ నియోజకవర్గంలో డ్రైనేజీ పైప్‌లైన్ పనులు నెమ్మదిగా జరుగుతున్నాయని ఆయన అన్నారు. తాను గతేడాది ఈ పనులు ప్రారంభమైన రోజే అధికారులు పనులు నిర్ధారిత సమయంలో పూర్తి చేయాలని సూచించడం జరిగిందని, అయితే అధికారులు మాత్రం ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆయన అన్నారు. నదీమ్ కాలనీలో రోడ్లపై ఇంకా నీరు నిలుస్తుందన్నారు. మరోవైపు టోలిచౌకిలో ఎన్నో షాపులలో వరదనీరు ఇప్పటికీ ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. వీటిపై అధికారులు ఏ మాత్రం స్పందించడం లేదని ఆయన అన్నారు. టోలిచౌకి ఫ్లైఓవర్ కింద జరుగుతున్న డ్రైనేజీ పనులను సత్వరంగా పూర్తి చేయాలని ఆయన అధికారులను కోరారు. ఆయన వెంట నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్ తదితరులున్నారు.

శాతం చెరువు నుంచి నీటి విడుదల



తూము నుంచి బయటకు వెళ్తున్న నీరు

గోల్కొండ: 'నిండు కుండలా శాతం చెరువు'అన్న శీర్షిక గత సోమవారం సాక్షిలో వచ్చిన వార్తకు అధికారులు స్పందించారు. వరుసగా కురుస్తున్న వర్షాలకు శాతం చెరువులో వరదనీరు భారీగా వచ్చి చేరుతుంది. సోమవారం రాత్రి సైతం భారీ వర్షం కురిసింది. కాగా చెరువులో నీరు చేరితే నదీమ్ మరోమారు ముంపునకు గురికావడం ఖాయమని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ వార్తపై అధికారులు స్పందించారు. ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ సైతం ఈ వార్తను చూసి వెంటనే శాతం చెరువును మంగళవారం ఉదయం సందర్శించారు. శాతం చెరువు తూములో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించాలని ఆదేశించారు. అధికారులు శాతం చెరువు తూములో పేరుకుపోయిన పిచ్చి మొక్కలు, వ్యర్థాలను తొలగించారు. తూములో నుంచి భారీగా వరదనీరు బయటకు పోతోంది. 2 రోజుల పాటు తూము ఇలాగే ఉంచితే చెరువులో నీటిమట్టం తగ్గుతుందని అధికారులు అంటున్నారు.

హోటల్ మేనేజ్‌మెంట్‌కు ఉజ్వల భవిష్యత్



అవార్డులను అందజేస్తున్న దృశ్యం

నాంపల్లి: హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సుకు నానాటికీ ఆదరణ పెరుగుతోందని నోవాటెల్ జనరల్ మేనేజర్, హెచ్ఆర్ఏ టీఎస్ హైదరాబాద్ కన్వెన్షన్ సెంటర్ ఉపాధ్యక్షుడు రూబిన్ చెరియన్, తెలంగాణ చెఫ్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ధర్మేంద్ర లంబా తెలిపారు. మంగళవారం రెడ్‌హిల్స్‌లోని ఫెడరేషన్ హౌస్‌లో రీజెన్సీ కాలేజ్ కలినరీ ఆర్ట్స్ హోటల్ మేనేజ్‌మెంట్ 29వ వార్షిక అవార్డుల ప్రదానోత్సవ సభ జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన వారు మాట్లాడుతూ.. హోటల్ మేనేజ్‌మెంట్‌కు మంచి భవిష్యత్ ఉందన్నారు. ఈ సందర్భంగా వారు పలువురు ప్రముఖులకు వార్షిక అవార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏరియా జనరల్ మేనేజరు సందీప్ జోషి, వెస్ట్ ఇండియా రాడిసన్ హోటల్ గ్రూప్ సౌత్ ఆసియా జనరల్ మేనేజరు రాడిసన్ బ్లూ, లెమన్ ట్రీ హోటల్స్ హైదరాబాద్ జనరల్ మేనేజరు సుకుబీర్ సింగ్, కళాశాల చైర్మన్ హూమ్ ఉల్ కురా, కార్యదర్శి మహ్మద్ ఫతే ఖాలెద్, కాలేజీ ప్రిన్సిపాల్ రమేష్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.